# నిజాయితీ! నీ విలువెంత?



ఆర్యే రమణా ప్రసాద్

సీతాపతిగారి చేతుల సన్నగా వణుకుతున్నాయ్.

నమ్మలేనట్టు మరోమారు చేతిలోని కాయితం వంక చూసారు. అనుమానం లేదు... అది తనకి ఎడ్రస్ చెయ్యబడ్డ మెమోనే. మరొక్కమారు చదివారు.

"మీరు ఈనెల రెండోతేదీన సబ్మిట్ చేసిన మెడికల్ బిల్లు తప్పుడు బిల్లని తెలిసింది. కాబట్టి మీమీద ఎందుకు చర్య తీసుకోకూడదో వివరిస్తూ సకారణమైన సమాధానాన్ని ఈ నోటీసు అందిన ఇరవైనాలుగు గంటల్లోగా తెలుపగలరు."

సీతాపతిగారు ఓమారు చుట్టూ పరికించి చూసారు. మిగిలిన గుమస్తాలందరూ తలవంచుకుని దీక్షగా పనిచేసుకుంటున్నారు.

వాళ్ళు నిజంగా పనిచేసుకుంటున్నారా లేక తననే చాటుగా గమనిస్తున్నారా? అనుకున్నారాయన. మామూలు పరిస్థితులలో అయితే ఎవరూ అంత దీక్షగా తలకూడ పైకెత్తకుండా పనిచేసుకోరు. మధ్య మధ్య పక్కవాళ్ళతో మాట్లాడుతూనో లేక ఏవో జోకులేసుకుంటూనో పనిచేసుకుంటారు. ఇది రోజూ కనిపించే సాధారణ దృశ్యం. ఈ రోజుకూడ పది నిమిషాల కిందటి వరకు అలానేవుంది...ఆఫీస్ ప్యూన్ లోకల్ టపా రిజిస్టరులో తన సంతకం తీసుకుని మెమో యిచ్చేదాక.

సంతకం చేస్తూ ఆశ్చర్యపోయారాయన. తనకా సమయంలో యివ్వబోతున్న మెమో ఏమై వుంటుందా అని! ఎందుకంటే తన సర్వీసులో అప్పటిదాక యింక్రిమెంటు మెమోలుతప్ప మరే మెమోలు తీసుకోలేదు. కాని తన యింక్రిమెంటు ఈ నెలలో కాదే! అదే తన ఆశ్చర్యానికి కారణం. దానికి తోడు అప్పటిదాక సందడిగా వున్న ఆఫీసు

హాలంతా ఒక్కసారి శ్మశాన నిశ్శబ్దం ఆవహించింది.

తనకి మెమో యివ్వబోతున్న సంగతి అందరికీ తెలుసా ? తనమీద సానుభూతిగా అందరూ మౌనం వహించేరా లేక తనకి మంచి శాస్తే జరిగిందని లోపల్లోపల మురిసి పోతున్నారా ?

సీతాపతిగారి తల పగిలిపోతోంది.

అసలిదెలా సంభవం ! తను ఫాల్స్ బిల్లు పెట్టడమా !!

తనమీద అంతటి అభియోగం వెయ్యగలిగేటంత ధైర్యమెలా వచ్చింది ఈ ఆఫీసుకి.

తన ముప్పై ఏళ్ళ సర్వీసులో తనతో కలసి పనిచేసిన వాళ్ళెవరూ యిలాంటి అభియోగం వెయ్యలేదు తనమీద. కనీసం మనస్సులో కూడ అలాంటి విషయాన్ని స్మరించనైనా స్మరించలేరు.

దానిక్కారణం !

ఈ ముప్పై ఏళ్ళలో తను నెలకొల్పిన రికార్డే !

తనంత నిజాయితీపరుడు వుండబోడని పేరుపడ్డ రికార్డది.

'నిప్పులాంటి మనిషి సీతాపతిగారు'' అన్నాడొకసారి ఒక కుర్ర గుమాస్తా. మొదట్లో వెటకారంగా అనేవాడు. తర్వాత మనస్ఫూర్తిగానే అన్నాడు. ఆ కుర్రగుమాస్తా అప్పట్లో కొత్తగా చేరాడు. సీతాపతిగార్ని కూడ కొత్తగా మెడికల్ బిల్సు చూసే సెక్షనులో వేశారప్పుడే. కొత్త సంవత్సరం రావడంతోనే వచ్చిపడతాయి మెడికల్ బిల్లులు. అందరూ మొదటి నెలలోనే జబ్బుపడి లేస్తారు. అందరికీ ఒకే డాక్టరు. అందరూ ఒకే షాపులో మందుల కయిన బిల్లులు తెస్తారు. సీతాపతిగారు ఈ బిల్సుకి తీవ్ర అభ్యంతరం తెలిపారు.

''ఈ బిల్సు నేను పాస్ చెయ్యను'' నిరసనగా అన్నారు.

''ఎందుకు చెయ్యరేమిటి ?'' మిగిలిన గుమాస్తాలు ఎదురుప్రశ్న వేశారు.

# నిజాయితీ ! నీ విలువెంత?

''అందరూ ఒకే నెలలో జబ్బు పడడమేమిటి. అందరూ ఒకే డాక్టరు దగ్గర ట్రీట్‌మెంటేమిటి ?''

''అందరూ ఒకేసారి జబ్బుపడకూడదని ఏమైనా రూలుందా ? సీజను మారింది... అందరం సిక్ అయ్యాం.''

''సీజను మారినప్పుడు వచ్చే జబ్బులు ఒకేరకంగా వుంటాయి. కాని యిలా రకరకాలుగా వుండవు.''

''పోనీ వచ్చే యేడు అందరం ఒకే జబ్బు పడ్డట్టు పెడతాం కాని ఈసారికి పాస్ చెయ్యండి'' అన్నాడా కుర్రగుమస్తా.

అందరూ గొల్లున నవ్వేరు. తిరిగి సీతాపతి గారి గాంభీర్యం చూసి తక్కున ఆగిపోయారు.

''చూడు బాబూ... నువ్వీ ఉద్యోగానికి కొత్త.. ఇలాంటి బిల్సు పాస్ చేస్తే కొన్ని యిబ్బందులొస్తాయ్. ముందు ముందు నీకే తెలుస్తుంది.''

''ఏం యిబ్బందులు సార్... మన జేబులోని సొమ్మేమైనా యిస్తున్నామా. గవర్నమెంటు సొమ్మివ్వడానికి అంత బాధపడిపోతారేమిటీ ?'' ఆ కుర్ర గుమాస్తా రెట్టించి మరీ అడిగాడు.

ఒక సీనియర్ గుమాస్తా ఆ కుర్రాణ్ణి చేయి పట్టి పక్కకిలాగి కళ్ళతోనే సౌంజ్ఞ చేసాడు... తొందరపడి నోరు జారొద్దన్నట్టుగా. సీతాపతి గారి నిజాయతీ గురించి ఆ సీనియర్ గుమాస్తాకి బాగా తెలుసు. అందుకే అతనేం మాట్లాడలేదు.

సీతాపతిగారికి మాత్రం కుర్ర గుమాస్తా తేలిగ్గా అనేసిన మాటలు సూటిగా తగిలాయి. గవర్నమెంటు సొమ్మేకదా అని అతి తేలిగ్గా అనేశాడా కుర్రాడు. అసలా గవర్నమెంటుకి సొమ్మెక్కణ్ణించి వస్తూందో అతనాలోచించడం లేదా ? పరోక్షంగా యిది మనం కట్టిన సొమ్మేనని అతను మరచిపోతున్నాడా ? ఏమైనా ఈ కాలం కుర్రాళ్ళతో వాదన పెంచుకోవడం అనవసర కాలయాపన. వాళ్ళు మెడకేస్తే కాళ్ళకి, కాళ్ళకేస్తే మెడకి వెయ్యగల సమర్థులు.

''మీరెన్ననుకున్నా సరే నేను మాత్రం ఇవి పాస్ చెయ్యమని రాయలేను. రేపు ప్రొద్దున్న ఆడిట్‌లో అడిగితే సమాధానం చెప్పాల్సింది నేను కాని మీరు కాదుకదా !'' అని నిక్కచ్చిగా తేల్చి చెప్పేశారు చివరికి.

అయినా వాళ్ళూరుకోలేదు. యూనియన్ ద్వారా ఈ విషయాన్ని ఆఫీసరు దగ్గరికి తీసుకెళ్ళారు. నాలుగైదు గంటలు తర్జనభర్జన లయ్యాక ఆఫీసరుచేతే డైరెక్టుగా పాస్ చేయించుకున్నారు బిల్సన్నీ. అంతేకాదు మర్నాడే సీతాపతిగార్ని ఆ సీట్లోంచి మరో సీటుకి బదిలీ చేయించారు.


పీడాపోయింది అనుకున్నారు సీతాపతిగారు. అలాంటి సీట్లోవుండి అందరికీ చెడ్డయ్యేకన్నా ఏ డిస్పాచ్‌లోనో ఎవరికి కనబడకుండా ఓ మూల కూర్చుని పని చేసుకోవడం ఉత్తమం.

''నిప్పులాంటి మనిషికదూ ... పాపం'' అన్నాడా కుర్రగుమాస్తా తనకి వినీ వినబడనట్టుగా. అసలే యువక రక్తమే మో యూనియన్ డిమాండ్‌చేసి తనని సీటు మార్పించడం మహా సరదాగా వుందతనికి. తానేదో వర్గశత్రువునని అతని భావన కాబోలు. కొంతకాలం పోయేక అతనే అన్నీ తెలుసుకుంటాడు అనుకుని సమాధాన పరుచుకున్నారు సీతాపతిగారు. ఆయననుకున్నట్టే ఒకరోజు జరిగిన సంఘటన తర్వాత ఆ కుర్రాడు కూడ పూర్తిగా మారిపోయాడు.


ఆ రోజు శ్రీమతికి కొద్దిగా ఒంట్లో బాగులేకపోతే మెడికల్ షాపుకెళ్ళి ఏవో మందులు కొన్నారు సీతాపతిగారు. అన్నీ చిన్న చిన్న మందులే కాబట్టి బిల్లు తీసుకోకుండానే వెనక్కి తిరిగారు.

''అదేమిటి సార్ బిల్లు తీసుకోకుండానే వెళ్ళిపోతున్నారు'' పలకరించిందో గొంతు వెనకనించి.

వెనక్కి తిరిగి చూసారాయన. కుర్ర గుమాస్తా ! తన వెనకే వచ్చుంటాడు షాపులోకి. షాపురద్దీగా వుండడం వల్ల తనతన్ని

జాండెక్స్ కథ
మిగిలిన కథ
జాండెక్స్ కాలేయానికి సంబంధించిన అన్ని వ్యాధులకీ.
కాలేయంచురుకుగా పనిచేయకపోతువుంటే జీర్ణశక్తి సరిగ్గా లేకపోతే
ఆకలి నశిస్తూ వుంటే, మద్యపానం వలన కాలేయం
చెడిపోయినప్పుడుకూడా ఎంతో మేలుగా పనిచేస్తుంది
నిజానికి జాండెక్స్ కాలేయం కొరకు ఆదర్శమైన టానిక్
జీర్ణశక్తికొరకు, ఆరోగ్యంకొరకు వరుసతప్పకుండా దీనిని
మీరు తీసుకోవచ్చు. అ, ఇదే మరి పూర్తి కథ
తయారుచేయువారు:
ద. కృ. పాండూ బ్రదర్స్, చెంబూర్, ప్రైవేట్ లిమిటెడ్
ద. కృ. పాండూ మార్గ్, చెంబూర్ బొంబాయి-400071
AH-S/83-56/TLG



ఆంధ్రప్రదేశ్ తెలుగు చిన్న పత్రికల ద్వితీయ సభ ముగింపు సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తున్న న్యాయమూర్తి శ్రీ కె. పున్నయ్య, సర్వశ్రీ సుబ్బారావు, గజ్జెల మల్లారెడ్డి, దామోదరం మునుస్వామి, కె. కేశవరావు, పి.వి.ఆర్.కె. ప్రసాద్, పోతుకూచి సాంబశివరావు, వెంకట మునిరెడ్డి, పాణ్యం చంద్రమౌళి గార్లని చిత్రంలో చూడవచ్చు.

గమనించలేదు. సీతాపతిగారు చిన్నగా నవ్వేరతన్ని చూసి.

''ఇంత చిన్న మొత్తానికి బిల్లెందుకని తీసుకోలేదు'' అన్నారు.

''అదేం... మెడికల్ బిల్లు పెట్టుకో వచ్చుగా. అన్నిట్లో స్ట్రిక్టుగా వుండే మీరే యిట్లా వదిలేసుకుంటే ఎట్లా'' అతని గొంతులో చిన్న ఎత్తిపొడుపు.

సీతాపతిగారు గాఢంగా నిట్టూర్చారు. ''చూడు నాయినా... మెడికల్ ఫెసిలిటీ వున్నంత మాత్రాన్న ప్రతి బిల్లు పెట్టాలని రూల్ లేదు. బిల్లు పెట్టడమూ మానడమూ అన్నది మన యిష్టాయిష్టాలమీద ఆధారపడి వుంది. నే నిప్పుడు బిల్లు పెట్టక పోవడానికి కారణం మరొకటి వుంది. ఇవి మామూలుగా రెండు రోజుల్లో తగ్గిపోయే జలుబు, దగ్గులకి సంబంధించిన మందులు. నలభై ఎనిమిది గంటల్లో తగ్గిపోయే ట్రీట్‌మెంటుకి మనం బిల్లు పెట్టినా యివ్వరు. అందుకే తీసుకోలేదు'' అతనికి అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించారు.

ఆ కుర్రాడు నిర్లక్ష్యంగా నవ్వేడు.

''మీది మరీ చాదస్తం సార్. నలభై ఎనిమిది గంటల రూలుంది కదాని బిల్లే పెట్టుకోమా? మొన్న ఉదయం అయిదు గంటలకి జ్వరం తగిలిందని చెప్పండి. ఇవాళ సాయంత్రం ఏడు గంటలకి తగ్గిందని చెప్పండి సరిపోలా? ట్రీట్‌మెంటు రెండ్రోజులకన్నా ఎక్కువ తీసుకున్నది కదా? మనకి తెలివితేటలుండాలే కాని ప్రతి సమస్యకి ఏదో పరిష్కారం ఉండనే ఉంటుంది.''

ఆ కుర్రాడివేపు చిత్రంగా చూసారు సీతాపతిగారు. 'ఈ కాలం కుర్రాళ్ళ ఆలోచనల ధోరణి ఎలా వుంటుందో ఇతని మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నది' అని అనుకున్నారు. తనకాపాటి తెలివితేటలు లేవని కాబోలు యితని ఆలోచన.

# నిజాయితీ! నీ విలువెంత?

''చూడు బాబూ నేనో విషయం చెప్తాను వింటావా?'' అని నెమ్మదిగా అడిగారు. అతని కంఠంలో వచ్చిన మార్పుకి ఆ కుర్రాడు కొద్దిగా భయపడ్డాడు.

''చెప్పండి'' అన్నాడు బుద్ధిమంతుడిలా.

''నువ్విచ్చిన సలహా చాల బాగుంది. అయితే అలాంటి అడ్డదారులున్నాయన్న సంగతి ఆ మాత్రం నాకు తెలీదనుకోకు. కాని యివన్నీ మన అతి తెలివిని ప్రదర్శించి ఏదో సాధించామనే అల్ప సంతోషం తప్ప నిజాయితీగా జీవించడంలో వున్న తృప్తినీ, సౌఖ్యాన్నీ అందివ్వలేవు. ఇలా అయినదానికీ, కాని దానికీ తాపత్రయపడుతూ జీవితాంతం మనశ్శాంతికి దూరమయి బతికే బ్రతుక్కన్నా జీవితాన్ని జీవితంలా బ్రతకడం నేర్చుకున్నప్పుడే అసలైన హాయి సిసలైన శాంతి లభిస్తాయి. అర్థమయిందనుకుంటాను'' అని విసురుగా అనేసి ఆ కుర్రాడి సమాధానంకోసమైనా ఎదురు చూడకుండా వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

ఆ తర్వాతెప్పుడూ ఆ కుర్రాడు తన జోలికి రాలేదు. అంతేకాదు. అతనుకూడ రెగ్యులర్‌గా కొత్త సంవత్సరం రాగానే బిల్లులుపెట్టే పద్ధతికి స్వస్తి చెప్పాడు.

మొత్తంమీద స్టాఫ్ అందరికీ సీతాపతి గారంటే కల్తీలేని సదభిప్రాయం ఏర్పడింది.

అటు సూర్యుడు యిటు ఉదయించవచ్చు. సముద్రాలింకి పోవచ్చు. హిమాలయాలకి రెక్కలొచ్చి ఎగిరిపోవచ్చు. కాని సీతాపతిగారు మాత్రం నీతి బాహ్యమైన పనిచేయరు అనే నమ్మకం అందరి మనసుల్లోనూ ఏర్పడిపోయింది.

అంతటి మంచి అభిప్రాయం అందరి మనసుల్లో ముద్రవేసుకున్న తరుణంలో యిలాంటి మెమో రావడమంటే అది ఎలాంటి పరిణామాలకి దారితీస్తుందో ఊహించుకోవచ్చు.

సీతాపతిగారి మనస్సు అణుబాంబుపడ్డ మహా సముద్రంలా అల్లకల్లోలమైంది.

ఇది తన నిజాయితీకే పరీక్ష!

తన వ్యక్తిత్వానికి అగ్నిపరీక్ష!!

మెమో కింద సంతకం చూసారు. కొత్తగా వచ్చిన కుర్రాఫీసరు!

ఆ ఆఫీసరు గురించి మిగిలిన వాళ్ళందరికీ ఎలాంటి అభిప్రాయంవున్నా తనకి మాత్రం సదభిప్రాయమే వుంది. అతనికి వూరు ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిగానే ఆఫీసంతా గగ్గోలయింది.

''చాల స్ట్రిక్ట్ ఆఫీసరు.''

''చండశాసనుట్ట.''

''ఆఫీసు ఫోన్‌ద్వారా పెర్సనల్ కాల్స్‌కూడ చేసుకోట్ట.''

''ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా ఆ రోజుకి శలవేనుట.'' అతని గురించి తాము విన్నదంతా ఒకరికొకరు చెప్పుకోసాగారు.

''కనీసం మూడేళ్ళయినా వుంటాడిక్కడ. ఈ మూడేళ్ళలో ఎవరికి మూడుతుందో ఏమో! ఇంతకు పూర్వం పనిచేసిన ఆఫీసులో ముగ్గుర్ని సస్పెండు చేసాట్ట. ఇక మెమోల సంగతి చెప్పనక్కర్లేదు. అందరూ ఏదో సందర్భంలో తీసుకున్నవాళ్ళే.''

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకున్నవాళ్ళలా వున్నారు వాళ్ళ మాటలు వింటూంటే. అప్పుడే కొత్తాఫీసరుకి రకరకాల పేర్లు పెట్టేశారు. యముడు! మొగుడు! గ్రహం! దరిద్రుడు!

''వాడు రాకుండా వుంటే బావుండును'' అని కొందరు.

''వాడొస్తున్న ట్రెయిన్ యాక్సిడెంటయిపోతే దేముడికి వంద కొబ్బరికాయలు కొడతాం'' అని మరికొందరు.

ఎందుకో యింత భయం అనుకున్నారు సీతాపతిగారు. ఆఫ్టరాల్ ఒక ఆఫీసరు స్ట్రిక్టుగా వున్నంతమాత్రాన్న అభినందించాల్సింది పోయి ఇలా భయపడ్డం, పరోక్షంగా అపహాస్యం చెయ్యడం ఎందుకు అనిపించిందతనికి.

''ఈ మూడేళ్ళు ఎలా గడుపుతామో ఏమిటో'' సీతాపతిగారు ఏదో పని చేసుకుంటూంటే వచ్చి పక్కనే కూర్చుంటూ అన్నాడొక గుమాస్తా.

''ఎందుకు?'' సీతాపతిగారి భ్రుకుటి ముడిపడింది.

''మీకింకా మన కొత్తాఫీసరు గురించి తెలీదులా వుంది, ఆఫీసంతా గోలెత్తిపోతూంటే.''

''ఏం... కొత్తాఫీసరు మనుషుల్ని నమిలి మింగేస్తాడా?'' సూటిగా అడిగారు సీతాపతిగారు.

గుమాస్తా నీళ్ళు నమలసాగాడు. ''అది కాదనుకోండి... బాగా స్ట్రిక్టుగా వుంటాట్ట...''

''వుండనీండి... మనదేంపోయింది... మన పని మనం సక్రమంగా చేసుకుంటున్నంత కాలం ఎవరూ మనల్ని ఏం చెయ్యలేరు.''

ఇంక అక్కడ కూర్చుంటే యిబ్బందని గుమాస్తా నెమ్మదిగా జారుకున్నాడు. ఇలా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడేవాళ్ళ దగ్గర కూర్చొని కాలక్షేపం కబుర్లు చెప్పాలంటే ఎవరికైనా యిబ్బందే.

మొత్తానికి ఆ ఆఫీసరు రానేవచ్చాడు ... ఏ ఏక్సిడెంటూ అవకుండానే. టెర్లిన్ ప్యాంటులో తెల్లని పాలియెస్టర్ షర్టు టక్ చేసి... నిగనిగలాడుతున్న బూట్లతో, నున్నగా దువ్వుకున్న ఉంగరాల క్రాపుతో నీట్‌గా షేవ్ చేసుకున్న నున్నటి గడ్డంతో... మనిషి చాల స్మార్ట్‌గా వున్నాడు. సరిగ్గా పది గంటలు కొట్టేసరికి క్యాబిన్‌లో అడుగుపెడతాడు. అతను క్యాబిన్‌లో ప్రవేశించగానే ప్యూన్ ఎటెన్డెన్స్ రిజిస్టర్ తీసుకెళ్ళి యివ్వాలి. అప్పటికింకా ఆఫీసుకి ఎవరైనా రాకపోతే వాళ్ళకింక ఆబ్సెంటే. సాధారణంగా క్యాబిన్ వదలి పైకిరాడు. కాని ఎవరిపనిలో ఏ చిన్న పొరపాటు జరిగినా యిట్టే పసిగట్టేస్తాడు. సాయంత్రం అయిదయే సరికల్లా క్యాబిన్‌లో మరివుండడు. తనేకాదు. ఆఫీసులో అయిదుతర్వాత ఎవరూ ఉండకూడదని అజ్ఞలు జారీ చేసాడు. మనిషి సరదాగానే మాట్లాడతాడుకాని ఎక్కువసేపు హస్కు కొట్టనివ్వడు.

ఎప్పుడో బ్రిటిష్‌వాళ్ళ కాలంలో యిలాంటి ఆఫీసర్లు ఉండేవారట అనుకున్నారు సీతాపతి గారు.

అలాంటి ఆఫీసరు ఎందుకింత తొందర పడి తనకి మెమో యిచ్చేడో అర్థంకాలేదాయనకి. డైరీతీసి చూసేరు సీతాపతిగారు. అందులో అన్ని బిల్లు నంబర్లు, తారీఖులు నోట్‌చేసుకుని ఉంచుకున్నారు. అన్నీ సక్రమంగానే వున్నాయ్.

బాగా ఆలోచించి ఏదో నిర్ణయానికి వచ్చారాయన. తెల్లకాయితం ఒకటి తీసుకుని సమాధానం రాసేరు.

“డియర్ సర్ ... మీరిచ్చిన ఆరోపణల పత్రం అందింది. మీరూహిస్తున్న విధంగా నా బిల్లు తప్పుడు బిల్లు కాదు. కాబట్టి మీరిచ్చిన నోటీసుని ఉపసంహరించుకోవలసిందిగా కోరుతున్నాను.”

రిప్లై రాసి యిన్‌వర్డ్ మెయిల్ సెక్షనులో యిచ్చేసి హాయిగా ఊపిరి పీల్చుకున్నారు సీతాపతి గారు. బహుశా తనెక్కడో తారీఖు వెయ్యడం తప్పు చేసుంటాడు. అంత మాత్రానికే మెమో యివ్వాల్సిన అవుసరం లేదు.

సీతాపతిగారి సమాధానం చాటుగా చూసి తెలుసుకున్న ఆఫీసు స్టాఫంతా ఏదో సస్పెన్సు సినిమా చూడబోతున్నంత ఉత్సాహంగా వున్నారు. ఒక ప్రక్క స్ట్రిక్టుమనిషిగా పేరుపడ్డ ఆఫీసరూ, మరోపక్క అంతకంటే స్ట్రిక్టుగా జీవితాన్ని గడిపే సీతాపతిగారు.

# నిజాయితీ ! నీ విలువెంత?

“గురూ స్ట్రిక్టూ, స్ట్రిక్టూ ఢీకొంటే ఏమౌతుంది” ఒక గుమాస్తా అడిగాడు మరో గుమాస్తాని లంచ్ అవర్‌లో.

“డిస్ట్రిక్ట్ అవుతుంది.” టక్కున సమాధానమిచ్చాడతను. అతనేసిన జోక్‌కి అందరూ గొల్లున నవ్వేరు.

“కాని ఆ ఆఫీసరుగాడికి జిగ్గుమనిపించేలా వుందా రిప్లై. ఈ దెబ్బకి యింకెప్పుడూ యిష్టమొచ్చినట్లు మెమోలు యివ్వడు.” కసితీరా అన్నాడో క్లర్కు.

“జానెను. ఎత్తెత్తి ఎంగిలాకుమీద కాలేసినట్టు యిస్తూ యిస్తూ మన సీతాపతి గారికే యివ్వాలా ఆ మెమో. మెమో యిచ్చే ముందైనా అవతలి వ్యక్తి ఎలాంటివాడో తెలుసుకోవద్దా” అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చాడు మరో క్లర్కు.

దూరంగా కూర్చునివున్న సీతాపతిగారికి వీళ్ళందరి మాటలు వినబడుతూనే వున్నాయ్. కాని ఆయనేమీ పట్టించుకోకుండా దీర్ఘాలోచనలో మునిగిపోయివున్నారు.

* * *

సీతాపతిగారు గమనించలేదు కాని ఆయన్ని చూసిన మొదటిరోజే మొహం చిట్లించాడా కుర్రాఫీసరు. లూజుగా వున్న కాటను ప్యాంటూ, ఖద్దరు చొక్కా, కాళ్ళకి అరిగిపోయిన చెప్పులూ, మధ్యకి విరిగి తిరిగి వైరుతో కలపబడిన కళ్ళజోడు, దాని వెనక నీరసంగా కనిపించే కళ్ళూ...ఈ వేషంతో దర్శనమిచ్చినసీతాపతిగార్ని చూడగానే అతని మనస్సులో ఏదో కసిలాంటిది పుట్టింది. ఇలా పైపై నిరాడంబరతలు ఒలికించేవాళ్ళే అన్ని రకాల అవినీతులకీ పాల్పడుతుంటారని అతని ఉద్దేశం. అందుకే ఆయన్నొక కంట కనిపెట్టాలని ఆ రోజే అనుకున్నాడు. అతనూహించినట్టుగానే సీతాపతిగారు మెడికల్ బిల్లుపెట్టారు. బిల్లన్నీ పట్టుకుని మందుల షాపుకెళ్ళి ఎంక్వయిరీ చేసాడు. షాపు ప్రొప్రయిటర్ అసలీ బిల్స్ తమిచ్చినవికావన్నాడు. బహుశా ఎవరో దొంగతనంగా అలాంటి బిల్సు ప్రింటు చేయించి వుండొచ్చనే అనుమానం వెలిబుచ్చాడు. దొరికాడు దొంగ అనుకున్నాడా ఆఫీసరు. సీతాపతిగారికి **షోకాజ్** నోటీసు యిచ్చేడు.

కాని అతనూహించినట్టు సీతాపతిగారు ఏం గాభరాపడలేదు. పైగా నోటీసు విత్‌డ్రా చేసుకోమంటూ ఒక కాయితం ముక్క రాసి పడేశారు. ఇది సహించలేని విషయం. యూనియన్ వుందికదాని అతని ధైర్యమై వుంటుంది. చూపిస్తాను నా తడాకా అనుకున్నాడు. మర్నాడు సీతాపతిగారు ఆఫీసుకి వచ్చేసరికి ఆయన టేబిల్‌మీద సస్పెన్షన్ ఆర్డర్సువున్నాయ్. సీతాపతిగారు ఆ ఆర్డర్సు చదివారు :

“మీరిచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదు. డొమెస్టిక్ ఎంక్వయిరీ జరపదలుచుకున్నాం. అంతవరకూ మిమ్మల్ని సస్పెన్షన్‌లో వుంచుతున్నాం.”

సీతాపతిగారి హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయ్. గుమాస్తాలందరి హృదయాల్లో ఉద్రేకం కట్టలు తెంచుకుంది.

“మీరేం భయపడకండి. వీడంతు చూస్తాం. మన యూనియన్ సెక్రటరీని స్వయంగా రమ్మని ట్రంకాల్ చేస్తున్నాం” అంటూ ధైర్యం చెప్పబోయారు. కాని ఆయన్ని కుంగదీస్తున్నది భయంకాదు, అవమానం అన్న సంగతి వాళ్ళు గ్రహించలేకపోయారు.

సీతాపతిగారేం మాట్లాడలేదు. మౌనంగా ఆఫీసు బయటికి నడిచారు. తిన్నగా తను మందులు కొన్న షాపుకి వెళ్ళేరు. తను డైరీలో రాసుకున్న బిల్లు నెంబర్లు, తారీఖులు షాపులో కుర్రాడికి చూపించారు. అతను బిల్లు పుస్తకాలన్నీ తిరగేసి పెదవి విరిచాడు.

“ప్చ్... లేవుసార్... మీరు తీసుకున్న బిల్సేవీ యిక్కడ లేవు.”


నాలుగువందల ఓల్టుల షాక్ తిన్నట్టు చూసారు సీతాపతిగారు.


“సరిగ్గా చూడు బాబూ... ఆ రోజు ఒక ఎర్రం తను వుండాలిక్కడ అతనిచ్చేడు.”

“అతనా... అతను మా ప్రొప్రయిటరు సార్... పిలుచుకొస్తానుండండి” అంటూ లోపలికెళ్ళాడు ఆ కుర్రాడు.

## పొగమంచుకి విరుగుడు

పశ్చిమ జర్మనీలో శీతాకాలంలో రోడ్లన్నీ మంచుతో నిండి ఉంటాయి. పొగ మంచు కూడా దట్టంగా వ్యాపించి ఉండటంతో ముందు దారి కనిపించదు. దీని వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పొగ మంచును కరిగించి రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి ఒక కొత్త పథకాన్ని చేపట్టారు. మంచు దట్టంగా వుండే ప్రాంతాలలో హెచ్చరిక పరికరాలను అమరుస్తారు. మంచుతీవులు ఎక్కువగా ఉన్నపుడు విమానాల ద్వారా కాల్షియం క్లోరైడు ద్రవాన్ని చల్లుతారు. ఇది — 24 డిగ్రీల సెల్షియస్ వద్దకూడా పొగమంచును కరిగిస్తుంది. దీనికోసం 22 విమానాలను సిద్ధంగా ఉంచుతారు. దీనిని మొదట మ్యూనిచ్ సాల్జ్‌బర్గ్ రహదారిపై ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతమైతే ఇతర ప్రాంతాలలో కూడా దీనిని అమలుచేస్తారు.




రెండు నిమిషాల తర్వాత ప్రొప్రయిటర్ బయటికివచ్చాడు. అతన్ని చూడగానే గుర్తు పట్టారు సీతాపతిగారు.

"వాట్ డు యు వాంట్?" ప్రొప్రయిటర్ గొంతులో విసుగు గోచరించింది.

"చూడండి... ఈ బిల్సు మీ దగ్గరే తీసుకున్నాన్నేను... వాటి డూప్లికేట్సు ఉన్నా యేమోనని."

బిల్ నెంబర్లు చూడగానే గుర్తుపట్టాడు ప్రొప్రయిటర్. రెండ్రోజులక్రితం ఎవరో ఆఫీసరు వీటిగురించే ఎంక్వయిరీ చేసారు. అతనే మళ్ళీ ఈ వ్యక్తినికూడ పంపించాడా? బిల్సన్నీ ఓమారు వెతికినట్టు నటించాడు. చివరికి అతను కూడ పెదవి విరిచాడు.

"సారీసార్... మీరేవో తప్పు నెంబర్లు నోటు చేసుకుని వుంటారు."

సీతాపతిగారు తప్పించి మరెవరన్నా ఆ స్థలంలో వుంటే ఆ ప్రొప్రయిటర్ మీదకి అమాంతం ఉరికి చంపేసేవారు. కనీసం చెడా మడా తిట్టేసేవారు. లేదా మరోమారు చూడ మని అభ్యర్థించేవారు. కాని సీతాపతిగారు మాత్రం యివేమీ చెయ్యలేకపోయారు. నిస్సహాయంగా అతనివంక చూస్తూ వుండిపోయారు. ఆయనప్పటికే జరిగిన సంఘటనలతో మూడు వంతులు క్రుంగిపోయారు. కాబట్టి ఏం జరిగి వుంటుందో వూహించగల శక్తి ఆయనలో నశించింది. ఆ రోజు తనిక్కడే మందులు కొన్నారు. బిల్లు కావాలని కూడ అడిగారు.

"రీయింబర్స్మెంటుందా?" అడిగాడు ప్రొప్రయిటర్.

ఔనన్నట్టు తలూపాడాయన.

"ఉండండి అయితే యిప్పుడే,వస్తా"నని లోపలికెళ్ళి రెండు నిమిషాల్లో బిల్లు బుక్కు పట్టుకొచ్చి తను బిల్లు చింపి యిచ్చాడు. ఇవాళ అదే బుక్ చూస్తే తన బిల్లు లేదు. అంతా కలయో, వైష్ణవమాయో అన్నట్టుంది. లేకపోతే ఏమిటీ వింత? అనుకున్నారు. బహుశా దేముడు తనమీద పగబట్టి వుంటాడు. అంత కంటె ఏంలేదు. ఆ దేముడే తనని రక్షించాలి.

* * *

ఎంక్వయిరీ మొదలయింది.

ఢిల్లీ నుంచి విమానంలో వచ్చేడు యూనియన్ జనరల్ సెక్రటరీ. వస్తూనే మెడికల్ షాపు కెళ్ళి ఎంక్వయిరీ చేసి వచ్చాడు. మిగిలినవాళ్ళ కిచ్చిన సమాధానమే యిచ్చాడు షాపు ప్రొప్రయిటర్. కావాలంటే బిల్సుకూడ చూసుకోమని అతనిముందు పడేశాడుకూడ.

యూనియన్ సెక్రటరీ బుర్ర చురుగ్గా పనిచెయ్య నారంభించింది. స్టాఫ్ చెప్పినదాన్ని బట్టి సీతాపతిగారిలాంటి నిజాయితీ మనిషి ఈ శతాబ్దంలోనే వుండడు. ఎంతటి నిజాయితీపరులైనా ఒక్కొక్కప్పుడు పరిస్థితుల ఒత్తిడికి తల ఒగ్గక తప్పదని తన అనుభవంలో చాలాసార్లు గ్రహించాడు. సీతాపతిగారు దీనికేం అతీతులు కారు. బహుశా సంసార బాధ్యతలు ఎక్కువవడం వలనో, ఏమో యిలాంటి కక్కుర్తిపని చేసి వుండవచ్చు. అంతమాత్రానికే ఆయనేం ఘోర మైన నేరం చేసినట్టుకాదు. తన సర్వీసులో యింతకంటె పెద్ద పెద్ద ఘోరాలు చేసినవాళ్ళనే చూసాడు. వాళ్ళందరికీ పడాల్సిన శిక్షలు తన వాక్చాతుర్యం ఉపయోగించి తక్కువ శిక్షలుగా మార్పించేడు. డిస్మిస్ అవాల్సినవాళ్ళకి యింక్రిమెంటు పోస్టుపోను చేయించడమో, యింక్రిమెంటు పోస్టుపోను అవాల్సినవాళ్ళకి సెన్సూర్ లెటర్‌తో సరిపెట్టించాడు. ఆఫ్టరాల్ వాటన్నిటితో పోలిస్తే సీతాపతిగారు చేసింది చాల మైనర్ అఫెన్స్. పాపం! ఈ ముప్పై ఏళ్ళలో అతను యూనియన్‌నించిఒక్కనాడూ ఏ సహాయం అర్థించలేదుట. చందామాత్రం ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఒకటో తారీఖ్కల్లా చెల్లించేస్తాట! అలాంటి సిన్సియర్ మెంబర్‌కి ఈ మాత్రం చెయ్యలేకపోతే ఎలా!

సీతాపతిగారి మీది ఛార్జెస్ చదివి విని పించారు యాజమాన్యం తరఫువాళ్ళు. దీనికి మీ సమాధానమేమిటి అని ప్రశ్నించాడు ఎంక్వయిరీ ఆఫీసరు.

సెక్రటరీ అందుకున్నాడు:

"అసలు స్టాఫ్‌మీద యిలాంటి ఎంక్వయిరీ లేమిటి? స్టాఫ్‌ని యిలా ప్రతి చిన్న విషయానికి ట్రబుల్ చేస్తుంటే ఆఫీసులో పనెలా జరుగుతుంది? ఆఫీసు డిగ్నిటీని దిగజార్చినట్టుకాదా? ఇలాంటి చిన్న విషయానికి ప్రాధాన్యత యిస్తే యాజమాన్యానికి ఒరిగే దేమిటి? అనవసరపు శ్రమ, ఖర్చు తప్పిస్తే... సంసారులన్నాక వారానికో? పది రోజులకో ఎవరో ఒకరికి ఒంట్లో బాగుండక పోవచ్చు. అవన్నీ బిల్సుకింద పెడితే సంవత్సరానికి ముప్పైమూడు బిల్సు పెట్టాల్సొస్తుంది...ఆఫీసు స్టాఫ్‌నంతా మెడికల్ బిల్సు చూడ్డానికే నియమించాల్సి వస్తుంది..."

ప్రవాహంలా సాగిపోతున్నది అతని ధోరణి సీతాపతిగారిక్కూడా అర్థమయిపోయింది. యూనియన్ సెక్రటరీకూడ తనది తప్పుడు బిల్లనే ఉద్దేశ్యంలో వున్నాడు. అందుకే అసలు పాయింటొదిలేసి మరోపక్కనించి నరుక్కొస్తున్నాడు. అసలు తనకి యూనియన్ సహాయం అవుసరంలేదు. ఏం చెయ్యాలో ముందే నిర్ణయించుకున్నాడు తను.

పావుగంట నాన్‌స్టాప్‌గా మాట్లాడిన తర్వాత యూనియన్ సెక్రటరీ చెప్పినదాంట్లో సారాంశం...ఇది చాల మైనర్ అఫెన్స్ కాబట్టి సస్పెన్షన్ విత్‌డ్రా చెయ్యమని.

ఎంక్వయిరీ ఆఫీసరు బుర్రగోక్కున్నాడు. అతనికి మహా చిరాగ్గా వుంది. ఈ ఎంక్వయిరీకి రావడం. అతను కూడ సీతాపతిగారి నిజాయితీ గురించి విన్నాడు. కాని తాను మాత్రం ఏం చెయ్యగలడు. కుర్రాఫీసరు చాల పట్టుదలగా వున్నాడు. ఓమారు సీతాపతిగారి వంకా, సెక్రటరీ వంకా, కుర్రాఫీసరు వంకా చూసాడు. చివరికి తన నిర్ణయం తెలియజేసాడు.

"సరే సస్పెన్షన్ విత్‌డ్రా చేయిస్తాను. కాని మళ్ళీ యిలాంటి పొరబాటు జరగబోదని అతను హామీ యివ్వాలి."

# నిజాయితీ ! నీ విలువెంత?

అందరి కళ్ళూ సీతాపతిగారివంక తిరిగాయ్. ఆదర్శాలకోసం పోరాడి పోరాడి అలసిపోయిన వృద్ధవీరుడిలా వున్నారాయన.

''ఒక్క సహాయం చెయ్యండి చాలు'' కళ్ళలో నీళ్ళు తిరుగుతూంటే గాద్గదికంగా అన్నారు.

''చెప్పండి'' సానుభూతిగా అన్నాడు ఎంక్వయిరీ ఆఫీసరు. సీతాపతిగారు రెండు చేతులూ ఎత్తి అతనికి నమస్కరించేరు. అతని చేతులు సన్నగా వణుకుతున్నాయ్.

''నన్ను రాజీనామా చెయ్యనివ్వండి.''

అందరూ ఒక్కసారి తుళ్ళిపడ్డారు...అతని నిర్ణయం తెలిసి.

''ఆ వే శ ప డ క ం డి... ఇందులో...'' అనబోయాడు ఎంక్వయిరీ ఆఫీసరు.

''క్షమించండి నేనేమీ ఆవేశంలో అనడం లేదు. బాగా నిర్ణయించుకునే వచ్చానిక్కడికి'' ఆయన మాటల్ని మధ్యలోనే తుంచివేస్తూ అన్నారు సీతాపతిగారు.

ఎంక్వయిరీ ఆఫీసరు చాలాసేపు దీర్ఘంగా ఆలోచించాడు. తొందరపడి నిర్ణయాలు తీసుకునేంత పసిపిల్లాడేమీ కాదు సీతాపతిగారు. ఆయన అహం బాగా దెబ్బతిన్నట్టుంది. ఇక చెప్పినా లాభం లేదనే సంగతి గ్రహించాడు.

''సరే అలానే చేద్దాం... నిన్నటి తారీఖుతో రాజీనామా పత్రం యివ్వండి... మీకిచ్చిన మెమోలు కూడ వాపసివ్వండి.''

రెడీగా రాసిపెట్టుకున్న రాజీనామా పత్రాన్ని, మిగిలిన మెమోల్ని జేబులోంచి తీసి టేబిల్‌మీదుంచేరు సీతాపతిగారు. లేచి నించుని అందరికీ ఓ మారు నమస్కారం చేసి మారు మాట్లాడకుండా క్యాబిన్ తలుపు దీసుకుని బయటికి నడిచారు. అందరి హృదయాలు చ లి ం చి పో యా యి. ఎంక్వయిరీ యింత విషాదంగా పరిణమిస్తుందని వాళ్ళు కలలోకూడ వూహించలేదు.

*　　　*　　　*

ఆఫీస్ స్టాఫంతా క్యాబిన్ బయట గుమిగూడి వున్నారు. సీతాపతిగారు వాళ్ళవంకైనా చూడ లేదు. కనీసం తన టేబిల్ దగ్గరికైనా వెళ్ళ లేదు. భారమైన అడుగుల్తో ఆఫీసు బయటికి నడిచారు. ఆయన్ని పలకరించడానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది.

''అయిపోయింది ! ఈ ఆఫీసుతో తనకి రుణం తీ రి పో యి ం ది. కాని ఈ విధంగా ముగుస్తుందని తనేనాడూ అనుకోలేదు. అయినా తనిందులో బాధ పడాల్సిందేమీలేదు. తనకి మహా అయితే మరో అయిదేళ్ళ సర్వీసుంటుంది. దిక్కుమాలిన ఆ అయిదేళ్ళ సర్వీసు కోసం తన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టి బ్రతకలేదు.''

''సీతాపతిగారూ ... ''

వెనక్కి తిరిగి చూసారు సీతాపతిగారు. కుర్రగుమాస్తా ఒగర్చుకుంటూ పరిగెత్తుకొచ్చాడు తన దగ్గరికి.

''సార్ ... రిజైన్ చేసేసారుట కదసార్... నా దొక్కమాట విని వెళిపోండి సార్'' అతను సీతాపతిగారి రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు. అతని కళ్ళు డైరెక్టుగా ఆయన మనస్సులోకి చూస్తున్నట్టుగావున్నాయ్. ''మిగిలినవాళ్ళ సంగతేమో కాని...నేను మాత్రం మిమ్మల్ని పూర్తిగా నమ్ముతున్నాను సార్.''

సీతాపతిగారు మాట్లాడలేదు.

''చాలు ! అమృతంలాంటి ఈ ఒక్కమాట చాలు బాబూ. ఈ ప్రాపంచిక విలువలన్నిటి కంటె అతీతమైన నీ అభిమానం ఒక్కటి చాలు నేను ధైర్యంగా బ్రతకడానికి'' అని మనస్సులోనే ఆ కుర్రాడికి కృతజ్ఞతలు తెలిపారు.

నెమ్మదిగా అతని భుజంతట్టి ముందుకి సాగిపోయారు. ఆయన వైఖరి అర్థంకాక అలా నిర్విణ్ణుడై చూస్తూ ని ల బ డి పో యా డా యువకుడు.


*　　　*　　　*

బజార్లోంచీ వెళుతున్నారు సీతాపతిగారు



# బాదల్ ఫ్యానులు

10 సం॥ సర్వీస్ గ్యారంటీ

మీ ఇంటి చూరునుండి చిరుగాలుల చిందులకు





టాప్ మోస్టు డీలక్స్
ఆకర్షణీయమైన చాక్‌లెట్
రంగుగల ఫ్యాన్




టాప్ మోస్టు
దృఢమైన ఎకానమి ఫ్యాన్

ప్రముఖ ఫ్యాన్ డీలర్లందరివద్ద లభించును.

Jaisons/AMA/19/84 TEL




ఎవరయినా కుక్కకి తమ రచనని అంకితం ఇస్తారా ? ఇవ్వరూ ? అయితే, వినండి ! మరాఠీలో అటువంటి పుస్తకమే ఉంది. సుప్రసిద్ధ మహారాష్ట్ర రచయిత గడ్కారా తన నాటకాన్ని ఒకదానిని ఒక కుక్కకి అంకితం ఇచ్చారు. ఆ కుక్క కథే గనుక మీరు వింటే గడ్కారా అంకితంలో ఎంత ఔచిత్యం ఉందో మీకు తెలుస్తుంది.

ఆ కుక్క ఛత్రపతి శివాజీది. ఆయనకి అదంటే ప్రాణం. కోటకి వెళ్లినా, యుద్ధానికి వెళ్లినా, చివరికి రాజభవనంలో ఎక్కడ ఉన్నా ఆయనతో ఉండవలసిందే.

ఒకనాడు శివాజీ రాయఘర్ కోటలో మరణించాడు. దేశం మారుమూలలనుంచి ఎందరో ప్రజలు తమ ప్రియతమ ఛత్రపతికి ఆఖరిసారిగా తమ అంజలి అర్పించటానికని వచ్చారు.

చితి చుట్టూ వేలాది సైనికులు కళ్ల నీళ్లతో, వినమ్రులై తమ నాయకునికి సెలవు చెప్తున్నారు. భేరీలు మోగాయి. ఫిరంగులు పేలాయి. చందనపు చెక్కలతో పేర్చిన చితి మంటలు పైకి లేస్తున్నాయి. ఒక నిముషం గడిచింది. ఇంతలో శివాజీ కుక్క పరిగెత్తుకుంటూ వచ్చి జ్వాలలోకి దూకింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలంతా చకితులయ్యారు.

కొన్ని దినాల తర్వాత శివాజీ సమాధి నిర్మించారు. ఆయన సమాధి పక్కనే ఆయన కుక్కకికూడా ఒక సమాధి కట్టారు.

రాయఘర్ కోటలో నేటికీ ఈ రెండు సమాధులని చూడవచ్చు. మానవుడికీ మూగ జంతువుకీ మధ్య స్నేహం ఎంత ప్రగాఢమయినదో ఇవి తెలుపుతాయి. ●

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక**
**1966 ఆగస్టు 19**
**సంచిక నుంచి**

ఉన్నట్టుండి ఏదో బంధం వేసినట్టు కాళ్ళు రెండూ ఆగిపోయాయ్. రోడ్డుకి అవతల పక్క కనిపిస్తున్న బోర్డువంక చూసారు.

"ఆదర్శ మెడికల్ స్టోర్సు."

ఇదే షాపులో తాను మెడిసిన్స్ కొన్నాడు ! లేదు— కొన్నట్టు భ్రమించాడు ! అదే చిత్రం. మళ్ళీ తల వంచుకుని నడకసాగించారు.

అంత రష్‌లోనూ సీతాపతిగారు షాపు దగ్గర ఆగి వెళ్ళడం గమనించాడు షాపులోని కుర్రాడు. గబగబా షాపులోంచి బయటికి పరిగెత్తి రోడ్డు క్రాస్‌చేసి ఆయన్ని చేరుకున్నాడు.

"సార్ ... సార్."

సీతాపతిగారు వెనక్కి తిరిగారు.

"సార్... సార్... ఆ రోజు బిల్లు గురించి అడిగింది మీరేకద సార్" ఆ కుర్రాడు గొంతులో ఏదో చెప్పాలన్న ఆత్రుత !

ఔనన్నట్టు తలూపారు సీతాపతిగారు.

"సార్... మీరెవ్వరికీ చెప్పనంటే మీకో రహస్యం చెప్తాను సార్" అటూ యిటూ చూసి అన్నాడా కుర్రాడు.

"ఏమిటి ?" నిర్లిప్తంగా అన్నారు సీతాపతిగారు.

"సార్... ఆ రోజు బిల్లు గురించి మీరడుగుతే తనకేం తెలీదన్నట్టు నటించాడు కద సార్ మా ప్రొప్రయిటరు. అతనలా నటించడానికో కారణంవుంది సార్. మా షాపులో నకిలీ మందులమ్ముతున్నట్టు ఓ సారి ఎవరో కంప్లెయింటిచ్చారు సార్... అప్పుడెవరెవరో వచ్చి ఎంక్వయిరీలు చేసి చివరికి షాపు లైసెన్సు కాన్సిల్ చేసేశారు సార్... మళ్ళీ ఏదో తంటాలు పడి మారుపేరుతో మరో లైసెన్సు సంపాదించేడు సార్ మా ప్రొప్రయిటరు. అయినా నకిలీ మందులు అమ్మడం మాత్రం మానలేదు సార్.. బిల్లడగరన్న ధైర్యం వున్నవాళ్ళందరికీ అవమ్ముతూంటాడు సార్... మొన్న మీకూ అవే అమ్మేడు సార్... తీరా మీరు బిల్లు కావాలని అడిగేసరికి ఏం చెయ్యాలో తోచక లోపలికెళ్ళి ఓ పాత బిల్లు పుస్తకంలో వాళ్ళబ్బాయిచేత బిల్లు రాయించి మీకిచ్చేశాడు సార్... కాని తర్వాత్తర్వాత ఎవరెవరో వచ్చి ఈ బిల్లు గురించి ఎంక్వయిరీలు చెయ్యడం మొదలుపెట్టేసరికి భయపడి అవన్నీ కాల్చేశాడు సార్... సార్.. మళ్ళీ లైసెన్సు కాని కాన్సిల్ చేస్తారా సార్."

సీతాపతిగారికి మరేం వినపడ్డంలేదు. జరిగిందంతా యిప్పుడే అర్థమవుతున్న దాయనకి.

"ఒక పొరబాటు కప్పిపుచ్చుకోవడంకోసం మరో పొరబాటు చెయ్యడానికి ఏ మాత్రం సంకోచించని ఈ వ్యవస్థ ఒక విషవలయం లాంటిది. అందులో పడ్డ నిజాయితీకి లభించే విలువెంత ?"

ఆలోచిస్తూ ముందుకి సాగిపోయారాయన. ★